తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
27 సెప్టెంబర్ 2026


# అక్రమ బట్టీలతో కనుమరుగవుతున్న అటవీ సంపద

- అటవీ భూమిని చేరబట్టిన అక్రమార్కులు
- అక్రమంగా మట్టి తరలింపు
- నిద్ర మత్తులో అధికార గణాలు





**శివ్వంపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పచ్చని అడవి తల్లిని గొడ్డలిపోటుకు బలి చేస్తూ, అడవి భూములను క్రమక్రమంగా ఆక్రమిస్తూ, వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ, సారవంతమైన నేలలు, చెరువు, కుంటాలను వాటి శిఖలను కూడా వదలకుండా కొందరు వ్యక్తులు అక్రమ పద్ధతిలో యథేచ్ఛగా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. శివ్వంపేట మండల పరిధిలోని రూప్లాతండాకు చెందిన కొందరు గిరిజనులమని చెప్పుకునే ఐదారు మంది వ్యక్తులు, ఫారెస్ట్ భూమిని ఆక్రమించడంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కొందరికి ఎకరం, రెండు ఎకరాల చొప్పున సాగు చేసుకొని జీవించడానికి పట్టాలు ఇవ్వడంతో అదే అదునుగా చేసుకొని క్రమక్రమంగా అటవీ భూమిని ఆక్రమించి పెద్ద ఎత్తున ఇటుక బట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, ఆ ప్రాంతాన్ని ఒక పారిశ్రామిక ప్రాంతంగా మార్చి ఫారెస్ట్ భూముల్లో ఇటుకల తయారీ కోసం వ్యవసాయ బోర్లకు అక్రమ కనెక్షన్లు వేసుకొని ఉచిత విద్యుత్తును దుర్వినియోగం చేస్తున్నా, సంబంధిత శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

మండల పరిధిలోని రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కంద్యా తండా, పాండ్యా తండా, రూప్లాతండా లతో పాటు కొత్తపేట గ్రామ శివార్లలలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో అక్రమ ఇటుక బట్టీల సామ్రాజ్య వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రూప్లా, కాంద్యా, పాండ్యా తండాలకు అనుకోని ఉన్న చెరువు కుంటల నుంచి అలాగే వ్యవసాయ భూముల నుంచి మట్టి తవ్వకాలు చేస్తుండడంతో ఆ ప్రదేశంలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్‌పూర్ చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అంతేకాదు సారవంతమైన భూములు సాగుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారుస్తున్నారు.

చదువుకునే వయసులో పాఠశాలకు వెళ్ళవలసిన చిన్నారులు ఇటుక బట్టీల వద్ద దర్శనమిస్తున్నారు. ఈ చిన్నారులతో అక్రమ ఇటుక బట్టీల వ్యాపారులు, వాటి నిర్వాహకులు పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు.

ఈ బట్టీల నిర్వహణకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వందలాది ఎకరాల్లో బట్టీలను పేర్చి అవి కాల్చడానికి ఉపయోగపడే కలపను రాత్రి సమయంలో అడవుల నుంచి అక్రమంగా కలపను ట్రాక్టర్ల ద్వారా బట్టీల వద్ద కు చేరవేస్తున్నారు. ఆయా తండాల్లో అక్రమార్కులు ఇటుక బట్టీలను నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇటుక బట్టీలను నిర్వహించాలంటే మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల ఉన్నతాధికారుల నుంచి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలనే నిబంధనలు ఉన్నప్పటికీ అక్రమార్కులు వాటిని పాటించడం లేదు, ఈ అక్రమ ఇసుక బట్టీలపై స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా, పర్యవేక్షణ లోపంతో అక్రమార్కులు ఇటుక బట్టీల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు.

ఆయా తండాల్లో అక్రమార్కులు ఇటుక బట్టీలను నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇటుక బట్టీల వ్యాపారాన్ని నిర్వహిస్తున్న అక్రమార్కులతో ఫారెస్ట్, రెవెన్యూ, మైనింగ్, విద్యుత్ శాఖల అధికారులు కుమ్మక్కై, వారిచ్చే మామూళ్ల కు మరిగి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే అక్రమ ఇటుక బట్టీల నిర్వాహకులను ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్, విద్యుత్ శాఖల అనుమతులు ఉన్నాయని చెబుతున్నా అవి నమ్మశక్యంగా లేవు. ఈ అక్రమ ఇసుక బట్టీలను పంట భూముల పక్కనే ఏర్పాటు చేస్తుండటంతో పాటు నర్సాపూర్ వెల్దుర్తి ప్రధాన రహదారికి అనుకోని ఉండడంతో ఇటుక బట్టీలు కాల్చుతున్న సమయంలో వెలువడే దుమ్ము, ధూళి, పొగలతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా తండాల రైతులు, వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# సోమవారం ప్రజావాణి రద్దు

**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్26(జనంసాక్షి):** నారాయణపేట కలెక్టరేట్లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి వనపర్తికి వస్తున్న సందర్భంగా అధికారులు అందరు వెళ్లవలసి ఉన్నందున. ప్రజావాణి రద్దు చేసినట్టు తెలిపారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి సోమవారం ప్రజావాణికి రావద్దని కలెక్టర్ తెలిపారు.

# వ్యక్తిగత దూషణలకు తావు లేదు



**బాలానగర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిపై టీడీపీ నేత చేసిన అసభ్యకర, వ్యక్తిగత వ్యాఖ్యలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత డా. సి.లక్ష్మారెడ్డి ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత జీవితంపై అసభ్య పదజాలంతో దాడి చేయడం సరికాదన్నారు. విమర్శలు ప్రజా సమస్యలు, విధానాలపైనే నిర్మాణాత్మకంగా ఉండాలని సూచించారు. నాయకులు సంయమనంతో వ్యవహరించి రాజకీయ హుందాతనాన్ని కాపాడుకోవాలన్నారు. ఎమ్మెల్యేపై ఓర్వలేకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నాయకులు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. టీడీపీ నేత తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయం
- జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి.పాటిల్

మిగతా 11లో..





**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని ఎస్పీ తెలిపారు. తన హక్కులను కాపాడుకునేందుకు ఆమె చూపిన తెగువ, ఆత్మవిశ్వాసం, పోరాట స్ఫూర్తి ఎంతో గొప్పదని అన్నారు.

# సమానత్వమే ఊపిరి.. సాధికారతే లక్ష్యం

- ఆడపిల్ల భారం కాదు... ఆకాశమే హద్దు
- నేడు అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం
- చదువుల నుంచి అంతరిక్షం దాకా కూతుళ్ల విజయాలు




**జడ్చర్ల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ఆడపిల్ల అంటే కేవలం ఒక కుటుంబ సభ్యురాలు మాత్రమే కాదు. ఆ ఇంట విరిసే చిరునవ్వు, ఆప్యాయతలకు నిలువెత్తు రూపం. ఒకప్పుడు భారమనుకున్న చోటే నేడు ఆలోచనా దృక్పథం మారుతోంది. నేడు సెప్టెంబర్ 4వ ఆదివారం నిర్వహించే అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం సందర్భంగా జనంసాక్షి ప్రత్యేక కథనం.

**ఆకాశమే హద్దు:**
నేటి తరం కుమార్తెలు అన్ని రంగాల్లోనూ తమ సత్తా చాటుతున్నారు. అవకాశాలు కల్పిస్తే ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నారు. చదువు, క్రీడలు, వైద్యం, వ్యాపార రంగాల్లో ప్రతిభ చాటుతున్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధిస్తున్నారు.

**కొండంత అండ:**
కష్టకాలంలో తల్లిదండ్రులకు కొండంత అండగా నిలుస్తూ ఆడపిల్ల ఇంటికి దీపం అని నిరూపిస్తున్నారు. పుట్టింటితో పాటు అత్తవారింటి పేరునూ నిలబెడుతున్నారు.

**సమాజ బాధ్యత:**
కూతుళ్లకు మనం ఇవ్వాల్సింది స్వేచ్ఛ సమాన అవకాశాలు, ఆడపిల్లను చదివించడం అంటే ఒక తరాన్నే వెలుగులోకి తెచ్చినట్లే. లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత.

**నమ్మకమే బలం:**
నేటి సమాజంలో ఆడపిల్లలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కొడుకులతో సమానంగా చదువుకోవడానికి, స్వయం సమృద్ధి సాధించడానికి స్వేచ్ఛ నిస్తే ఏ రంగంలో నైనా సాధించి చూపిస్తాం. తల్లిదండ్రులు మనపై ఉంచే నమ్మకమే ముందుకు నడిపిస్తుంది.

**ఆడపిల్లలు సమాజానికే గర్వకారణం:**
ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి ఇంట్లో ఆనందానికి లోటుండదు. కూతురు చూపే ఆప్యాయత, బాధ్యత కొండంత ధైర్యాన్నిస్తాయి. మా కూతురు సాధిస్తున్న విజయాలు చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. ఆడపిల్లలను భారంగా చూడకుండా సరైన చదువు, ప్రోత్సాహం అందిస్తే సమాజానికి పేరు తెస్తారు.



– వలకొండ మహేష్, జడ్చర్ల

# జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటమే లక్ష్యం

- నేడు నారాయణఖేడ్‌లో టీడబ్ల్యుజేఎఫ్ 3వ మహాసభ

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్) ఉద్యమాలను కొనసాగిస్తోంది. నారాయణఖేడ్ డివిజన్ 3వ మహాసభ ఈ నెల 27న ఉదయం 11 గంటలకు విశ్వకర్మ భవన్‌లో నిర్వహించనున్నారు. మహాసభలో గత ఉద్యమాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

**ఇళ్ల స్థలాల కోసం ఉద్యమం...**

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించాలనే డిమాండ్‌తో నారాయణఖేడ్‌లో నిర్వహించిన ఉద్యమాల ఫలితంగా స్థలాలు అందినట్లు సంఘం నాయకులు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల కోసం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, హైదరాబాద్ ఐఅండ్‌పీఆర్ కార్యాలయం ఎదుట



నిరసనలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**రైల్వే పాసుల పునరుద్ధరణకు డిమాండ్...**

కరోనా సమయంలో నిలిచిపోయిన జర్నలిస్టుల రైల్వే పాస్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని టీడబ్ల్యుజేఎఫ్ కోరుతోంది. కేంద్ర మంత్రులు, రైల్వే బోర్డు అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ధర్నాలు నిర్వహించినట్లు నాయ




కులు తెలిపారు.

**హక్కుల పరిరక్షణే లక్ష్యం...**

ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఉచిత ఆర్టీసీ, మెట్రో పాస్‌లు, అర్హులందరికీ అక్రిడిటేషన్లు కల్పించాలని కోరుతున్నారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులను అరికట్టి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల్లో పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## విద్యార్థుల కోసం అధ్యాపకుల పాట్లు

**పుల్కల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** చదువుకోవాల్సిన వయసులో కొందరు విద్యార్థులు కళాశాలకు వెళ్లకుండా రోడ్లపై తిరుగుతున్నారు. పుల్కల్ ప్రభుత్వ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నానని చెప్పి, మొబైల్ ఫోన్‌తో రోడ్డుపై తిరుగుతుండగా అధ్యాపకులు గుర్తించారు. ఇద్దరు అధ్యాప



కులు అతడిని ఆప్యాయంగా నచ్చజెప్పి కళాశాలకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అధ్యాపకులు చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు. మొబైల్ వినియోగంపై నియంత్రణ లేకపోవడం చదువుపై ప్రభావం చూపుతోందని అధ్యాపకులు పేర్కొంటున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై పర్యవేక్షణ పెంచి, అధ్యాపకులతో సమన్వయం చేసుకోవాలని సూచిస్తున్నారు.

## రసాయన శాస్త్రంలో ప్రేరణ లూంబాకు పీహెచ్‌డీ



**పటాన్‌చెరువు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థిని ప్రేరణ లూంబా పీహెచ్‌డీకి అర్హత సాధించారు. 'అమ్మోనియా, ఎసిటిలీన్ కోసం మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ (ఎంఓఎఫ్), కోవలెంట్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ (సీవోఎఫ్) పదార్థాల సంశ్లేషణ, లక్షణాల పరిశీలన, గది ఉష్ణోగ్రత వద్ద వాయువులను గుర్తించే పనితీరు' అంశంపై ఆమె పరిశోధన చేశారు. ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్రబాబు మార్గదర్శకత్వంలో సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ప్రమాదకరమైన అమ్మోనియా, ఎసిటిలీన్ వాయువులను సున్నితంగా, ప్రత్యేకంగా గుర్తించేందుకు పోరస్ ఎంఓఎఫ్, సీవోఎఫ్ పదార్థాల రూపకల్పన, అభివృద్ధిపై పరిశోధన సాగింది. షిఫ్ బేస్ ఆధారిత, మెటల్ డోప్డ్ ఫ్రేమ్‌వర్క్‌లు సెన్సింగ్ సామర్థ్యం, స్థిరత్వం, ఎంపికలో మెరుగైన పనితీరు చూపినట్లు తెలిపారు. పర్యావరణ పర్యవేక్షణ, పారిశ్రామిక భద్రత, ప్రజారోగ్య రంగాల్లో వీటి వినియోగానికి అవకాశం ఉందన్నారు. ప్రేరణను గీతం అదనపు ఉపకులపతి డి.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, డైరెక్టర్ ఎం.రెజా, విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం తదితరులు అభినందించారు.

## నేడు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛలో యాదగిరిగుట్ట

### ప్రభుత్వానికి కృతజ్ఞత సభను జయప్రదం చేయండి

**చేర్యాల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ప్రభుత్వానికి కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఫోరం చేర్యాల మండల అధ్యక్షుడు అంబటి అంజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి అందె అశోక్ పిలుపునిచ్చారు. శనివారం చేర్యాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కేశవరావు కమిటీని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫోరం 9వ వార్షికోత్సవం సందర్భంగా కేశవరావు కమిటీ సభ్యులతో పాటు తెలంగాణ ఉద్యమంలో



పోరాడిన నాయకులను ఆహ్వానించినట్లు చెప్పారు. ఉద్యమకారులు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ జహీరుద్దీన్, బండోజు భాస్కర్, అంబటి నరసయ్య, గణయాది, ఈరి భూమయ్య, యాకూబ్, లక్ష్మయ్య, ఉపేందర్‌రావు, వెంకయ్య, పవన్, పంతం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీర వనితకు.. ఘన నివాళులు

**పాపన్నపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పాపన్నపేట మండల కేంద్రంలో శనివారం (చిట్యాల) చాకలి ఐలమ్మ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహ ప్రాంగణంలో రజక సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు



వేసి ఘన నివాళులర్పించారు. భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం,రజాకార్ల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదిరించి పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### అంగరంగ వైభవంగా

## గణనాథుని నిమజ్జన శోభాయాత్ర

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** చిన్నశంకరంపేట మండల కేంద్రంలో అయ్యప్ప యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన శోభాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. వినా



యక చవితి నుంచి పూజలు అందుకున్న గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర చేపట్టారు. డప్పు వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గ్రామ వీధుల్లో శోభాయాత్ర కొనసాగింది. మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి మాట్లాడుతూ.. గణనాథుని కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన శోభాయాత్రలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా యువత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలోని పండుగలు, జాతరలను విజయవంతం చేయడంలో యువత పాత్ర అభినందనీయమన్నారు.

### చెంచుల సమస్యల

## పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### మన్ననూరు ఐటీడీఏలో ఎస్టీ కమిషన్ ప్రత్యేక సమావేశం



**అచ్చంపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** చెంచు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్‌ను చెంచు నాయకులు కోరారు. మన్ననూరు ఐటీడీఏలో శుక్రవారం ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలు సమస్యలపై వినతులు సమర్పించారు.

ఐటీడీఏలో రెగ్యులర్ సిబ్బంది నియామకం, ఉపాధి హామీ పనుల అమలు, సీఓఈ పీవీటీజీ కళాశాల, చెంచు విద్యార్థుల విద్య, వైద్య సదుపాయాలు, పోడు భూముల సమస్యల పరిష్కారం, ఉపాధి అవకాశాల కల్పనపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాసులు, కాట్రాజు మల్లయ్య, మాసయ్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



**హవేలీ ఘన్పూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా బూరుగుపల్లి జడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వడులపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీల్లో విజేతలకు నాయకులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మండల జనరల్ సెక్రటరీ శ్యామ్ ప్రభు, బీజేవైఎం అధ్యక్షుడు సురేందర్ గౌడ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, బూత్ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



**కొల్చారం, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్య సాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె రవికాంత్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**చేర్యాల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ఆధిపత్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని శనివారం చేర్యాల పట్టణ రజక సంఘము అధ్యక్షుడు శివగారి అంజయ్య కులస్తులతో కలిసి అంగడి బజార్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శనిగారి యాదగిరి, తుమ్మలపల్లి అంజయ్య, శనిగారి మల్లయ్య, బసవరాజు యాదగిరి, తుమ్మలపల్లి శ్రీనివాస్,రమేష్, ముత్తిగారి శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, రాచకొండ రమేష్ పాల్గొన్నారు.

జనంసాక్షి
మెదక్ - మహబూబ్‌నగర్ జిల్లా
ఆదివారం 27 సెప్టెంబర్ 2026


## కాంగ్రెస్‌లో చేరిన రామచంద్రాపూర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



**కోహెడ, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండలంలోని రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాంటెస్ట్ సర్పంచ్ జక్కనిపల్లి లక్ష్మణ్, వార్డు సభ్యులు జేరిపోతుల సంజీవ్, శివ, రవీందర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మంద ధర్మయ్య, మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, ఏఎంసీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనాథ్ మహర్షి తదితరులు పాల్గొన్నారు.

## దామరచెరువులో చేయూత పెన్షన్ల క్షేత్రస్థాయి పరిశీలన



**నిజాంపేట్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలం దామరచెరువు గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పెన్షన్ లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవో సంగ్రామ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఇంటింటికీ వెళ్లి వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగ పెన్షన్ల లబ్ధిదారుల ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు వారి ప్రస్తుత స్థితిని పరిశీలించారు. అర్హులైన వారికి మాత్రమే పెన్షన్లు అందేలా చూడటం, అనర్హులను గుర్తించడం, కొత్తగా అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయడం ఈ పరిశీలన ఉద్దేశమని ఎంపీడీవో తెలిపారు. లబ్ధిదారులు మరణించినా, గ్రామం విడిచి వెళ్లినా పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతోష్, కార్యదర్శి మౌనిక, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలి



**అచ్చంపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ ఉద్యమ నిర్మాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఈ నెల 27న హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనుంది. వేడుకల నిర్వహణ కమిటీలో అచ్చంపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్‌ను కో-కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి, ఉద్యమానికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా భారతరత్న ప్రదానం చేయాలని కోరారు. కో-కన్వీనర్‌గా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ఉత్సవ కమిటీ చైర్మన్ గూడూరి శ్రీనివాస్‌కు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**పుల్కల్, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.మండల రజక సంఘం అధ్యక్షుడు చాకలి వెంకటేశం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రజక సంఘం నాయకులు, సభ్యులతో కలిసి జయంతి వేడుకలు నిర్వహించారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం: కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్ ఐలమ్మ విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక అన్యాయాలను ఎదురించి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన తరగతుల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సహాయ అధికారులు అమర్ జ్యోతి, అమర్నాథ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, టీఎన్జీవోస్ నాయకులు జావిద్ అలీ, రవి, రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు నామాల నగేష్, యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కూర వేణుగోపాల్, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య దశలోనే ఆరోగ్య పరిరక్షణ అందరిదీ బాధ్యత



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** బాల్య దశలోనే చిన్నారులకు పౌష్టికాహారం అందించి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు సద్గుణ అన్నారు. న్యాల్‌కల్ దళితకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పోషక విలువలు లేని చిరుతిళ్లు, సెల్‌ఫోన్‌లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. ఆటలు, పాటలతో చిన్నారుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు అంజమ్మ, పద్మమ్మ, జ్యోతి, జగదేవి, ఆశ కార్యకర్త రేణుక పాల్గొన్నారు.

## దీవించమ్మా .. వనదుర్గమ్మ తల్లి



**పాపన్నపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పౌర్ణమి సందర్భంగా మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో శనివారం వైభవంగా పల్లకీ సేవా నిర్వహించారు. సుందరంగా పూలతో అలంకరించిన పల్లకీలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించారు. అర్చకులు శంకర శర్మ,పార్థివ శర్మ అమ్మవారికీ ప్రత్యేక పూజలు చేశారు.రాజగోపురం,శివాలయం ముందుగా ఈపల్లకీ ఊరేగింపు కొనసాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నాగ్‌ధర్ పాఠశాలలో విద్యా సమీక్ష సమావేశం



**నిజాంపేట్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలం నాగ్‌ధర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలల సముదాయ స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిశుభ్రమైన పాఠశాలలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మండల విద్యాధికారి రాములు సూచించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణను సమీక్షించి, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇన్‌చార్జి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవానికి తరలిరావాలి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నశంకరంపేటలోని సోమేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, రంగోలి పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మహిళలు, యువత రంగోలి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

# పోక్సో బాధితులకు సత్వర సేవలు అందించాలి

- **శాఖల సమన్వయంతో న్యాయ సహాయం, పునరావాసం, మానసిక సహకారం అందించాలి: జడ్జి జయప్రసాద్**



**సిద్దిపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పోక్సో, లైంగిక నేరాల బాధితులకు సత్వర సేవలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట అదనపు జిల్లా జడ్జి జయప్రసాద్ సూచించారు. బాధితులకు న్యాయ సహాయంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పునరావాస సదుపాయాలు, మానసిక ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టు సముదాయంలో శనివారం పోక్సో, లైంగిక నేరాల బాధితుల సంక్షేమం కోసం పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో జడ్జి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులకు అందుతున్న సేవలు, వారి అవసరాలు, న్యాయ సహాయం, సంక్షేమ పథకాలు, పునరావాసం, మానసిక ఆరోగ్య సేవల అమలుపై చర్చించారు.

**బాధిత పిల్లల అవసరాలకు ప్రాధాన్యం...**

పోక్సో కేసుల్లో బాధిత చిన్నారుల అవసరాలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని జయప్రసాద్ సూచించారు. న్యాయ సహాయంతో పాటు భద్రత, సంరక్షణ, పునరావాసం, మానసిక సహకారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేసు ప్రక్రియలో చిన్నారులు మరింత ఇబ్బందులకు గురికాకుండా సున్నితమైన విధానంలో సహకారం అందించాలని పేర్కొన్నారు.

**శాఖల మధ్య సమన్వయం కీలకం...**

న్యాయ, పోలీసు, బాలల సంరక్షణ, వైద్య, పునరావాస విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని సమావేశంలో చర్చించారు. బాధితులకు అందాల్సిన ప్రభుత్వ సహాయాన్ని గుర్తించి, అర్హత మేరకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జడ్జి సూచించారు. సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

అనంతరం బాలల సంక్షేమ కమిటీ సభ్యులు జడ్జి జయప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా సన్మానించారు.

కార్యక్రమంలో స్పెషల్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములు, జిల్లా బాలల సంరక్షణ అధికారి డా. రాము, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు డి.నరసింహులు, బాలచంద్రం, భరోసా కేంద్రం న్యాయ అధికారి సౌమ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి కేంద్రీకృత కిచెన్

**నాణ్యమైన, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మెదక్ టౌన్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తున్నామని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మెదక్ మార్కెట్ యార్డులో నిర్మించిన కేంద్రీకృత కిచెన్‌ను మంత్రి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లోని యంత్రాలను పరిశీలించి, ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేసి నాణ్యత, రుచిపై ఆరా తీశారు.

పథకం ద్వారా విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకే అల్పాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రీకృత కిచెన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఈ పథకం దోహదపడుతోందన్నారు. రాష్ట్రంలో 12వ తరగతి వరకు అల్పాహారం అందించే చర్యలు చేపడుతున్నామని,



సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.

మెదక్‌లో వచ్చే ఏడాది నుంచి 2,500 మంది విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. రూ.100 కోట్లతో పబ్లిక్ స్కూల్ మంజూరైనట్లు చెప్పారు. టెక్నాలజీ శిక్షణ కోసం ఏటీసీ సెంటర్ ప్రారంభించామని, శిక్షణ పొందిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోం






దన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస మాట్లాడుతూ జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దీటి రాజును సన్మానించిన హరీశ్‌రావు



**బెజ్జంకి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** సిద్దిపేట మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును సిద్దిపేట జిల్లా రజక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి రాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, సంఘం బలోపేతానికి చేస్తున్న కృషిపై చర్చించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన దీటి రాజును హరీశ్‌రావు అభినందించి శాలువాతో సన్మానించారు. సంఘం సమస్యలు, కార్యక్రమాలను నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, రజక సంఘం నాయకులు దొంతి లక్ష్మణ్, వరుకోలు సత్తయ్య, పొన్నాల వీరేష్, బీఆర్‌ఎస్ నాయకులు ఎలుక దేవయ్య, కొరివి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జనంసాక్షి కథనానికి స్పందన

**గుంతలకు మరమ్మతులు.. వాహనదారులకు ఊరట**





**పుల్కల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పుల్కల్ మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకు సమీపంలో సింగూరు ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంపై జనం సాక్షిలో ఈనెల 24 న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి మరమ్మతు పనులు చేపట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు తగ్గనున్నాయి. సమస్యను ఇంత త్వరగా పరిష్కరించడంపై స్థానికులు,వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

# సిద్దిపేట జిల్లాలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- **రంగనాయక సాగర్ వద్ద వేడుకలు**

**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను శనివారం రంగనాయక సాగర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. కలెక్టర్ కె.హైమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, పర్యాటక నోడల్ అధికారి విజయ్‌భార్గవ్, డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఆర్డీఓ సదానందం తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు, అధికారులు హాజరయ్యారు.

**యువ టూరిజం క్లబ్‌లకు బహుమతులు...**

జిల్లాస్థాయి యువ టూరిజం క్లబ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు కళాశాలలు, మూడు పాఠశాలల క్లబ్‌లకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతిభను ప్రదర్శించారు. పర్యాటకం, చారిత్రక వారసత్వ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

**వారసత్వ నడక.. ఆక్సిజన్ పార్కు సందర్శన...**

అనంతరం రంగనాయక సాగర్ వంతెనపై






విద్యార్థులతో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. పర్యావరణ పర్యాటకంలో భాగంగా మార్పడగ ఆక్సిజన్ పార్కును సందర్శించి పర్యావరణ పరిరక్షణ, అడవులు, జీవవైవిధ్యంపై అవగాహన పొందారు. డీడబ్ల్యూఓ శారద పోషకాహారం, సమతుల్య ఆహారంపై వివరించారు.

**కొమురవెల్లి మల్లన్న దర్శనం...**

తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు





కొమురవెల్లి మల్లన్న స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయ చరిత్ర, విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నారు. ఈఓ సుధాకర్‌రెడ్డి, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్శనం, భోజనం, లడ్డూ ప్రసాదం ఏర్పాట్లు చేశారు. స్థానిక కళాకారులు సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో పర్యాటకం, వారసత్వం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించడమే కార్యక్రమాల లక్ష్యమని అధికారులు తెలిపారు.

## టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

**తెలకపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పాలమూరు ఎన్నారై ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌ను శనివారం తెలకపల్లి జెడ్పీ



హెచ్‌ఎస్‌లో నిర్వహించారు. నాలుగు పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, షీల్డ్ అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.300 నగదు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభన్‌బాబు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుల అభివృద్ధి కీ కృషి

- **మాజీ జడ్పీటీసి మహేశ్ గుప్తా**



**శివ్వంపేట, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** క్రీడాకారుల అభివృద్ధి కీ తాను శ్రాయశక్తుల కృషి చేస్తానని మాజీ జడ్పీటీసి పబ్బా మహేశ్ గుప్తా అన్నారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు తన సొంత నిధులతో కొనుగోలు చేసి పంపించిన వాలీబాల్ కిట్టును, వాలీబాల్ నేషనల్ క్రీడాకారుడు సంద్ర వినోద్ ద్వారా శనివారం విద్యార్థులకు అందజేయించారు. ఈ సందర్భంగా సంద్ర వినోద్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి వున్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రతినిత్యం క్రీడాకారులు సాధన చేయడం కోసం వాలీబాల్ కిట్లు గ్రహించిన మహేష్ గుప్తా, వెంటనే స్పందించి విద్యార్థులకు వాలీబాల్ కిట్లను అందజేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే సహాయ సహకారాలను తప్పకుండా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందుమతి, రాజేందర్ రెడ్డి, లింగోజిగూడ శ్రీకాంత్ నాయక్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం

- **అవగాహన పెంచేందుకే పోషణ మాసోత్సవాలు**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. పోషణ అభియాన్‌లో భాగంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 9 వరకు నెల రోజుల పాటు జిల్లాలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

పోషకాహార లోపంతో చిన్నారుల్లో రోగనిరోధక శక్తి తగ్గే అవకాశం ఉన్నందున ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులు, పాలు, గుడ్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. విటమిన్లు, ఖనిజ లవణాలు, కాల్షియం వంటి పోషకాలు ఆరోగ్యానికి కీలకమని పేర్కొంటున్నారు. వారంలో కనీసం మూడు రోజులైనా ఆకుకూరలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**గర్భిణులు, బాలింతలకు పోషకాహారం...**

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు నెలకు 30 గుడ్లు, రోజుకు 200 మి.లీ. పాలు అందిస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లలకు నెలకు 16 గుడ్లు పంపిణీ చేస్తున్నారు. 2017 నుంచి చిన్నారులకు బాలామృతం అందిస్తున్నారు. బాల సంజీవని ద్వారా ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లోని పిల్లలకు గుడ్డు, పాలు అందిస్తున్నారు.

**అవగాహన కార్యక్రమాలు...**

సీడీపీవో చంద్రకళ మాట్లాడుతూ పోషణ మాసోత్సవాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ పౌష్టికాహార ప్రాధాన్యాన్ని వివరిస్తున్నట్లు తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.



**పెద్దచెల్మెడలో కార్యక్రమం...**

మునిపల్లి మండలం పెద్దచెల్మెడ రైతువేదికలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. సీడీపీవో చంద్రకళ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం, పోషకాహారంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శైలజ, జ్యోతి, సర్పంచ్ రాధాబాయి జోషి, ఉపసర్పంచ్ ఖాజామైనొద్దీన్, పోషణ అభియాన్ సమన్వయకర్త లక్ష్మణ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు





సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 26(జనంసాక్షి): 18 ఏళ్ల లోపు బాలికలు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహాలు నిర్వహిస్తే సంబంధితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి హెచ్చరించారు. సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, స్వోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పూజారులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలకు బాల్య వివాహ నిషేధ చట్టం-2006పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివాహాలు నిర్వహించే ముందు వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని లలిత కుమారి సూచించారు. బాల్య వివాహ రహిత జిల్లాగా సంగారెడ్డిని తీర్చిదిద్దేందుకు అన్ని మతాల పెద్దలు సహకరించాలని కోరారు. బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రాజారెడ్డి, డీసీఆర్‌బీ సీఐ రమేష్, డీసీపీవో రత్నం మాట్లాడుతూ బాల్య వివాహాలకు పాల్పడితే జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో స్వోప్ డైరెక్టర్ ఉప్పలయ్యతో పాటు సుమారు 100 మంది మత పెద్దలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ మీడియా ద్వారా గద్వాల పర్యాటక ప్రచారం - కలెక్టర్




గద్వాల, సెప్టెంబర్ 26(జనంసాక్షి): జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, మరియు పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి చాటాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. శనివారం గద్వాల మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురాతన కట్టడాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన ఆలంపూర్ శ్రీ జోగులాంబ దేవి ఆలయ విశిష్టతను భక్తులకు చేరవేయాలన్నారు. 17వ శతాబ్దానికి చెందిన చారిత్రక గద్వాల కోట, దాని లోపల ఉన్న సుందరమైన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ వైభవాన్ని డిజిటల్ వేదికలపై ప్రదర్శించాలని కోరారు. దక్షిణ తెలంగాణకు జలజీవనిగా మారిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కృష్ణా నది తీరాన వెలిసిన బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాల దృశ్యాలను విస్తృతంగా పంచుకోవాలన్నారు. పర్యాటక రంగాభివృద్ధితో పాటు గద్వాల బ్రాండ్‌గా నిలిచిన స్థానిక చేనేత కళా వైభవాన్ని కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విద్యార్థులు రీల్స్, బ్లాగులు సోషల్ మీడియా పోస్టుల ద్వారా వినూత్నంగా ప్రచారం చేస్తే జిల్లాకు పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని అధికారులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ కేంద్రంపై దాడి

- నిర్వాహకునిపై కేసు నమోదు



తూప్రాన్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): కల్లకల్ గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తూ, అక్రమంగా గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తున్న కేంద్రంపై జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు , ఎస్ఐ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది సంయుక్తంగా దాడి నిర్వహించారు. రాజస్థాన్ రాష్ట్రం, పోలీ జిల్లా, కాశీఫార్మా గ్రామానికి చెందిన ఘనశ్యామ్ కుమావత కల్లకల్ గ్రామంలో నివాసం ఉంటూ, ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 200కు పైగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి రీఫిల్లింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమతులు లేకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వహించడం, గ్యాస్ సిలిండర్లను అక్రమంగా రీఫిల్లింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు తెలిపారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ పోలీసులు తెలిపారు.

# రూ.21 లక్షలకు లడ్డూ వేలంలో దక్కించుకున్న జగ్గారెడ్డి





సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): సంగారెడ్డిలో జరిగిన గణపతి నిమజ్జన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఓల్డ్ బస్టాండ్ వద్ద చైతన్య యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ వేలంలో పాల్గొని రూ.21 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ మొత్తాన్ని సంగారెడ్డి ప్రజల తరఫున వేలం పాడినట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తన కుటుంబం అంటే భార్య, కొడుకు, కూతురు మాత్రమే కాదని, సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ తన కుటుంబ సభ్యులేనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా తన ఆధ్వర్యంలో పండుగలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో దక్కిన లడ్డూను తన కుటుంబ సభ్యుల ద్వారా అక్కడికక్కడే ప్రజలకు పంచిపెట్టారు.

శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు జరిగిన నిమజ్జన వేడుకలను ఆయన పర్యవేక్షించారు. కింది బజార్ చెరువు వద్ద భారీ క్రేన్లతో విగ్రహాల నిమజ్జనం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఊరేగింపుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆటోలో, కాలినడకన తిరుగుతూ పరిస్థితులను గమనించారు. ప్రజలు ఉత్సాహంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# ప్రపంచ వారసత్వ సంపదలు కాపాడుకోవాలి

- ముడుమాల్ నీలురాళ్ల పరిరక్షణకు సమష్టి కృషి: కలెక్టర్ ప్రియాంక



కృష్ణ, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలోని వేల సంవత్సరాల నాటి నీలురాళ్లు (మెగాలిథిక్ సమాధులు) చారిత్రక, పురావస్తు, ఖగోళ శాస్త్రపరంగా విశిష్టమైనవని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ముడుమాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అరుదైన చారిత్రక ప్రదేశాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముడుమాల్ నీలురాళ్ల ప్రాంతంలో నక్షత్రాలు, సూర్యుడి కదలికలకు సంబంధించిన గుర్తులు, ప్రత్యేక రాతి నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. ప్రాంత అభివృద్ధికి పర్యాటక శాఖకు కార్యాచరణ ప్రణాళిక సమర్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం సరిహద్దు ఏర్పాటు చేసి పరిరక్షణ చర్యలు చేపడుతున్నామని, ప్రధాన రహదారి నుంచి నీలురాళ్ల ప్రాంతానికి రహదారి అనుసంధానాన్ని మెరుగుపరుస్తామని వెల్లడించారు. కలెక్టర్ నిధులతో రెండు, మూడు వారాల్లో రహదారి పనులకు మంజూరు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీలురాళ్ల పరిసర భూములకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని, అవసరమైతే భూసేకరణ వంటి మార్గాలను పరిశీలిస్తామని అన్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం ముడుమాల్ వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నందున అభివృద్ధి, పరిరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

అనంతరం డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. విద్యార్థుల దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెరిటేజ్ అకాడమీ ప్రతినిధి డాక్టర్ ప్రవీణ్, పర్యాటక అధికారి రషీద్, డీఈఓ గోవిందరాజు, ఎంఈఓ నిజాముద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషోర్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జడ్చర్ల అభివృద్ధికి రూ.14.50 కోట్లు

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో రూ.14.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శనివారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.12.50 కోట్ల నగర అభివృద్ధి నిధులతో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ పనులతో పాటు 11వ వార్డులో రూ.2 కోట్ల ముడా నిధులతో చేపట్టే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముడా నిధుల్లో జడ్చర్లకు 30 శాతం కేటాయించేలా ఒప్పందం జరిగిందన్నారు. జడ్చర్ల నుంచి ముడాకు అధిక ఆదాయం వస్తున్నందున ఖమ్మం తరహాలో 50 శాతం నిధులు కేటాయించాలని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరనున్నట్లు తెలిపారు. సరస్వతీనగర్ డీటీసీపీ లేఅవుట్ సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావించామని, త్వరలో ఎన్‌ఓసీ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి వార్డును అభివృద్ధి చేసి మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు.

బహుజన్ సమాజ్ పార్టీ(BSP)

# ఆధ్వర్యంలో చాకలిఐలమ్మ జయంతి వేడుకలు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ బిజినపల్లి మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో లింగసానిపల్లి గ్రామస్తులు కోట్లనరేష్, కోట్ల రామకృష్ణ, గంగోజీ,మల్లేష్, సుదర్శన్, వెంకటేష్, ఖాసిం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# గజానన యువసేన వినాయకుడి ఘనంగా నిమజ్జనం

- పూజల్లో పాల్గొన్న ఎస్ఐ మధుకర్ రెడ్డి

శివ్వంపేట సెప్టెంబర్ 26 (జనంసాక్షి): శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో గజానన యువసేన ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథునికి గత 13రోజులుగా నియమనిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు జరిపిన ప్రత్యేక పూజలకు గ్రామస్తులంతా వచ్చి గణనాథుని దర్శించుకుని ముక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి జరిగిన నిమజ్జన ఊరేగింపులో గ్రామస్తులకు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బ్యాండు భజంత్రీలతో నృత్యాలు చేస్తూ గజానన యువసేన సభ్యులు ఊరేగింపులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ఊరేగింపు కార్యక్రమానికి శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి హాజరై గణపతి దేవుని దర్శించుకొని మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గజాన యువసేన నిర్వాహకులు ఎస్ఐని శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ భానగారి శ్రీనివాస్, నాయకులు బుద్ధుల భిక్షపతి చన్నగారి బాలకృష్ణ, చన్నగారి మల్లేష్ బొట్టు మల్లేష్ బొట్టు చంద్రం. చిన్నగారి రమేష్ మొగుడంపల్లి ఆనంద్ గుప్తా, మనోజ్,చందు, క్రేఫ్, పుల్లగారి పవన్, అభి, రిత్విక్, చన్నగారి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

## సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి





**నారాయణఖేడ్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ వీరవనిత, సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నారాయణఖేడ్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, సేవలు చిరస్మరణీయమన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు తెలంగాణ అమరవీరులు, పోరాట యోధులను విస్మరించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి త్యాగాలకు గౌరవం కల్పిస్తోందన్నారు. హైదరాబాద్ కోఠిలోని ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.
మున్సిపల్ చైర్మన్ నగేష్‌కుమార్ శెట్కర్ మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. సాయుధ రైతాంగ పోరాట యోధుల త్యాగాల ఫలితంగానే ప్రజల్లో హక్కుల కోసం పోరాడే స్ఫూర్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు విజయ్ బుజ్జి, రాజు, బీజేపీ నేత సాయిరాం, వెంకటేశ్వర రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# యూపీఐ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్
- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో సంతకాల సేకరణ




**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఐ చార్జీల విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట మాడ్రన్ బస్టాండ్‌లో యూపీఐ చార్జీలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.2,000కు మించిన వ్యక్తి-వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.300 వరకు రుసుము వర్తిస్తుందని తెలిపారు. వ్యక్తి-వ్యక్తి లావాదేవీలు, రూ.2,000 వరకు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కొత్త రుసుము విధానం చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై పరోక్ష ఆర్థిక భారాన్ని మోపే అవకాశం ఉందన్నారు.
యూపీఐ ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటైన డిజిటల్ మౌలిక వసతిగా కొనసాగాలని, రుసుముల విస్తరణకు మార్గంగా మారకూడదన్నారు. వ్యాపారులపై విధించే రుసుమును వినియోగదారులపై అదనపు భారంగా బదిలీ చేయకుండా ప్రభుత్వం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, యువత, విద్యార్థులపై ఎలాంటి పరోక్ష భారం పడకుండా చూడాలని డిమాండ్ చేశారు. యూపీఐ రుసుముల విధానం, వాటి పంపిణీ, భవిష్యత్ మార్పులపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు.
యూపీఐ చార్జీల బిల్లును ఉపసంహరించుకోకపోతే ప్రజలను ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు వేల్పుల చంద్రశేఖర్, గొర్ల రాజు యాదవ్, బోడపట్ల రాజు, మ్యాక యాదయ్య తదితరులతో పాటు సుమారు 60 మంది యువతీ యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**అమ్రాబాద్ సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని సీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో భోజన వసతిఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్ముల ఎల్లయ్య, ఉపాధ్యాయులు, కంచర్ల నిరంజన్, ఎల్లయ్య, ఎలిజాల శ్రీను, సత్యం, నల్లగంతుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఏర్పాటు చేశారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**తెలకపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండల కేంద్రంలో మల్లికార్జున రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బక్కయ్య, సంఘం అధ్యక్షుడు శ్రీను, ప్రచార కార్యదర్శి పవన్ కుమార్, సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ నిరంజన్, వార్డు సభ్యులు కొమ్ము శ్రీను, సొంటె మల్లేష్, రజక సంఘం నాయకులు లింగస్వామి, మెట్రో శివ, పసుపుల విజయ్, సత్యనారాయణతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు




**వడ్డేపల్లి, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** వడ్డేపల్లి మున్సిపాలిటీ లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి మంజుల ధర్మ, తదనంతరం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా ధైర్యానికి , ఆత్మగౌరవానికి, సామాజిక న్యాయ పోరాటానికి ప్రతీకగా నిలిచారన్నారు ఆమె చూపిన ధైర్యం పోరాటం, పట్టుదల ప్రజల కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలన్నారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ గారి జీవితం తెలంగాణ ప్రజల హక్కుల. మహిళలు ధైర్యంగా ముందుకు సాగేందుకు, ఆమె త్యాగాలు సేవలు ఆశయాలను స్మరించుకుంటూ ముందుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపాడు. కార్యక్రమంలో ఆరవార్డు కౌన్సిలర్ దేవమ్మ .ఏడవ వార్డు కౌన్సిలర్ ఎస్ విజయభాస్కర్.8వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి సంబి జయశ్రీ. పదవ వార్డు కౌన్సిలర్ శ్రీ గుజ్జుల తిమ్మప్ప. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ,మెప్మా సిబ్బంది, రజక సంఘం సభ్యులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు...

## చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలను వేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి





**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలో చాకలి అయిలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు.. పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని తిరుమలాపూర్ చెరువు కట్ట వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాలలు వేశారు. భూమికోసం.. భుక్తి కోసం.. పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్ మురళి పంతులు, సుభాష్ గౌడ్ దాచ సంగమేశ్వర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్ల గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు వెంకట్రావు. గాజు కుమార్ ప్రశాంత్ రెడ్డి, మండల రజక సంఘం అధ్యక్షుడు చాకలి ప్రభు, బాధ్యులు వెంకటేశం, కిష్టయ్య, లక్ష్మణ్, సాయి, నరేష్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**వనపర్తి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవితం, పోరాటాలు నేటి తరానికి ఆదర్శమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఐడీఓసీలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజాకారులు, భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక అని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## 40, 57 డివిజన్లలో హైమాస్ట్ విద్యుత్ దీపాలు ప్రారంభం



**మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ నగరంలోని 40, 57వ డివిజన్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రివేళ ప్రజలకు మెరుగైన భద్రత, సౌకర్యాలు కల్పించేందుకు ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డివిజన్ల వారీగా సమస్యలను గుర్తించి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పాదచారులు, వాహనదారులకు రాత్రివేళ ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ నగరంలో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**గుండుమాల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గుండుమాల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైల యాదవ్, డిప్యూటీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ మధుకర్ రావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, తిర్మాపురం రవీందర్ రెడ్డి (రాజారెడ్డి), ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కె. తిర్మలయ్య, బీఆర్ఎస్ నాయకులు కాటి రవీందర్ గౌడ్, జగన్ రెడ్డి, దద బాలప్ప, మాసిరెడ్డి, సాకలి నర్సిములు (టీచర్), రాజయ్య గౌడ్, సాంబశివుడు, రంగారెడ్డి, బోయిని వెంకటయ్య, శంకర్ నాయక్, కొత్త నాగేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌తో రైతులకు నిలకడైన ఆదాయం

## రైతులందరూ ఆయిల్‌పామ్ సాగు చేయాలి: మంత్రి తుమ్మల

**నంగునూరు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని రైతులకు నిలకడైన, అధిక ఆదాయం అందించే పంట ఆయిల్‌పామ్ అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో రైతులు పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని పిలుపు నిచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలోని ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి శనివారం ఆయన సందర్శించారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..** తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి తొలి సంతకం చేశానన్నారు. అధికారుల కృషితో ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా పూర్తయిందని, దేశంలోనే అత్యాధునిక యంత్రాలతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ తెలంగాణకు కీలకమన్నారు. గత మార్చి నుంచి ఇప్పటివరకు 70 వేల మెట్రిక్ టన్నుల గెలలను ప్రాసెస్ చేసినట్లు తెలిపారు. అధిక ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ రావడంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తోందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో టన్నుకు రూ.12 వేలు



గా ఉన్న ధర ప్రస్తుతం రూ.24 వేలకు పెరిగిందని పేర్కొన్నారు.

ప్రతి 10 వేల ఎకరాల ఆయిల్‌పామ్ సాగుకు ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 11 ఫ్యాక్టరీలు నిర్మాణంలో ఉన్నాయని, రిలయన్స్ సంస్థ కూడా రిఫైనరీతో కూడిన ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. రానున్న మూడేళ్లలో తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలన్న లక్ష్యం ఉందన్నారు.

నర్మెట్ట ఫ్యాక్టరీలో రిఫైనరీ పనులు కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాది నాటికి ఆయిల్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు. గెలల పిప్పి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నామని, వ్యర్థ





నీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యను తపస్పల్లి రిజర్వాయర్ నుంచి నీరు అందించి పరిష్కరించిన కలెక్టర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణతో విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని, స్వదేశీ రైతులకు మేలు జరిగేలా 44 శాతం దిగుమతి సుంకం అమలు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పాల్గొన్నారు.



## యువ టూరిజం క్లబ్ పోటీల్లో నంగునూరు పాఠశాలకు ద్వితీయ బహుమతి

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**నంగునూరు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పాఠశాల విద్యాశాఖ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లా స్థాయి పోటీల్లో నంగునూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రంగనాయక సాగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ హైమావతి, పర్యాటక శాఖ అధికారి విజయ్ భార్గవ విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు రూ.12 వేల నగదు బహుమతి అందజేశారు. దీంతో పాఠశాల క్లబ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. హెచ్‌ఎం గొట్టిపర్తి రామస్వామి గౌడ్, గైడ్ టీచర్ ఎర్రన్నగారి రాంగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంఈఓ తగిరెడ్డి దేశిరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## పాఠశాలలో టాయిలెట్లు ప్రారంభం.. ల్యాప్‌టాప్ బహూకరణ



**మల్దకల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండలంలోని మేకలసోంపల్లి పాఠశాలలో నూతనంగా నిర్మించిన బాలుర టాయిలెట్లను సర్పంచ్ జయ రాముడు ప్రారంభించారు. హెచ్‌ఎం అంజి విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు తాళాలను స్వీకరించారు. బేస్‌లైన్ పరీక్షలో జిల్లాలోని 371 పాఠశాలల్లో మేకలసోంపల్లి పాఠశాల మూడో స్థానంలో నిలవడంతో ఉపాధ్యాయులను సర్పంచ్ అభినందించారు. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు వినేందుకు పాఠశాలకు హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ను అందజేశారు. పాఠశాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న స్కావెంజర్ గోవిందమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వడ్డేపల్లి 26 సెప్టెంబర్ (జనంసాక్షి):** వడ్డేపల్లి మండల రజక సంఘం నూతన కమిటీని ఆ సంఘం నాయకులు శనివారం ఎన్నుకున్నారు ఐలమ్మ జయంతి సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రజక సంఘం మండల అధ్యక్షుడుగా తిప్పన్న ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా వెంకటేశు, కోశాధికారిగా మల్లేష్, సభ్యులుగా మద్దిలేటి, రామారావు, శీను, రాజన్న తదితరులను ఎన్నుకున్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



**మక్తల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 26, 27 తేదీలలో నిర్వహించబడుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మక్తల్ ఎంజేపీ న్యూ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ఎం. రాములు, ఏటీపీ మహేష్ సత్యనారాయణ మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఎస్టీయూ 80 వసంతాల వైభవోత్సవాన్ని విజయవంతం చేయాలి



**చేర్యాల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ఎస్టీయూ టీఎస్ 80 వసంతాల వైభవోత్సవానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మ్యాడ శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం చేర్యాల మండల ఎస్టీయూ కార్యాలయంలో వైభవోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. 1946లో ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని తెలిపారు. 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్ నాగోల్‌లోని శుభం సమావేశ మందిరంలో వైభవోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్నం భూపాల్, మండల నాయకులు, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం



**రాజోలి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతిని పురస్కరించుకుని రాజోలి మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయన నిరాడంబర జీవనం, నిబద్ధత, ప్రజాసేవా దృక్పథం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హసన్, మాజీ అధ్యక్షుడు పులిపాటి దస్తగిరి, దేవాలయ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ విభాగం ప్రతినిధులు, ఎంపీటీసీ రషీద్, వార్డు సభ్యుడు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గట్ల మల్యాల విద్యార్థిని ఎంపిక





**నంగునూరు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా గట్ల మల్యాల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బానోతు దీపిక జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 27 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో దీపిక పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.రమేష్ తెలిపారు. దీపిక ఎంపికపై పాఠశాల పాఠశాల ఆప్‌కమిటీ చైర్మన్ తిరుమల, సర్పంచ్ ఇంగ నరేష్, ఉపసర్పంచ్ తిప్పని శ్రీను, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. సాఫ్ట్‌బాల్‌లో శిక్షణనిచ్చి ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్‌కుమార్‌ను కూడా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థిని రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## వరుసగా మూడోసారి బోరు వైర్లు చోరీ



**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో తాగునీటి సరఫరాకు ఉపయోగించే బోరు మోటర్ విద్యుత్ వైర్లు శుక్రవారం చోరీకి గురయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు బోరు వద్దకు చేరుకుని వైర్లను అపహరించినట్లు సర్పంచ్ మాణిక్యమ్మ తెలిపారు. బోరు వైర్లు చోరీ కావడం ఇది మూడోసారని, గతంలో రెండుసార్లు ఇదే విధంగా చోరీలు జరిగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తాగునీటి బోరునే లక్ష్యంగా వరుస చోరీలు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

రాత్రివేళల్లో బోరు ప్రాంతాన్ని పరిశీలించి వైర్లు అపహరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉంటే ప్రజలు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ సూచించారు.

## వీధి కుక్కల స్వైర విహారం



**జడ్చర్ల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల సమస్య రోజు రోజుకూ తీవ్రరూపం దాల్చుతోందని పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పాతబజార్ ప్రాంతంలో శనివారం పదుల సంఖ్యలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ కనిపించడంతో స్థానికులు, బాటసారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు కాలనీవాసులపై, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై దాడికి తెగబడే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చొరవ చూపాలని, నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## శ్రీవాణి నగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పనులు



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** శ్రీవాణి నగర్ కాలనీలో రూ.48 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందా రం నరసింహాగౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తు న్నట్లు తెలిపారు. డ్రైనేజీ, అంతర్గత రోడ్లు తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, తలారి రాములు, మైపాల్‌రెడ్డి, కొల్లూరు యాదగిరి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## చందంపేట గడి పునరుద్ధరణ పనుల పరిశీలన



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 26 (జనం సాక్షి):** చిన్నశంకరంపేట మండలం చందం పేట గ్రామంలోని చారిత్రక పురాతన గడి పునరుద్ధరణ పనులను ఎంపీడీవో దామోదర్ శనివారం పరిశీలించారు. సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. పురాతన కట్టడాల పరిరక్షణకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచిం చారు. చందంపేటకు చారిత్రక గుర్తింపుగా ఉన్న గడిని భవిష్యత్ తరాలకు అందించా ల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత, విద్యార్థుల్లో పురాతన కట్టడాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. **సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..** గడి పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, పురాతన కట్టడాల దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు, యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయ నున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు, ఫీల్డ్ అసిస్టెంట్ భూషణం తది తరులు పాల్గొన్నారు.

## పురాతన ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు



**కొల్చారం, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం వెంకటా పూర్‌లోని సుమారు 200 ఏళ్ల నాటి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పోతంశెట్టి పల్లి హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఉమారాణి మాట్లా డుతూ.. పురాతన ఆలయాల నిర్మాణశైలి, శిల్పకళ, స్థానిక చరిత్ర, సాంస్కృతిక వార సత్వాన్ని విద్యార్థులకు పరిచయం చేయడమే సందర్శన ఉద్దేశమన్నారు. ఆలయంలోని రాతి నిర్మాణాలు, శిల్పకళ అప్పటి ప్రజల జీవన విధానం, కళా నైపుణ్యానికి ప్రతిబిం బంగా నిలుస్తాయని తెలిపారు. క్షేత్ర సందర్శనలు విద్యార్థుల్లో చరిత్ర, సంస్కృతిపై ఆసక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నెబోయిన సుజాత, ఉపాధ్యాయు లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు

- **విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా బోధన.. క్రమశిక్షణకు పెద్దపీట**




**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** విద్యా బోధనలో అంకితభావం, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వర్తిస్తున్న మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌కు చెందిన మం గలి ఆంజనేయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. వికారా బాద్ జిల్లా కుల్కచర్ల మండ లం పుట్టపహాడ్ జడ్పీహెచ్ ఎస్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సులభమైన బోధనా పద్ధతులతో విద్యార్థుల్లో భౌతిక శాస్త్రంపై ఆసక్తి పెంపొందిస్తూ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నారు. క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుత ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా సొంత నిధులతో స్టేజీ ఏర్పాటు చేశారు. తన ఇద్దరు కుమారులను అదే ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలో అందుబాటులో ఉంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన అధికారులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

## చైనా సాఫ్ట్‌బాల్ పోటీలకు సిద్దిపేట విద్యార్థి ఎంపిక

- **బానోతు ఈశ్వరికి హరీశ్‌రావు ఆర్థిక చేయూత**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** గట్ల మల్యాల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బానోతు ఈశ్వరి చైనాలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలకు భారతదేశం తరఫున ఎంపికైంది. ఈ సందర్భంగా సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఈశ్వరి కలిసింది. ఆమెను అభినందించిన హరీశ్‌రావు చైనాలో అద్భుతంగా రాణించి సిద్దిపేట, తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాం క్షించారు. చైనాకు వెళ్లేందుకు రూ.2 లక్షలు అవసరమవుతుండగా గ్రామస్థులు సహకరించడం అభినందనీయమన్నారు. తనవంతుగా రూ.50 వేల ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ నుంచి మూడుసార్లు జాతీయస్థాయికి ఎంపికైన ఈశ్వరి అంతర్జాతీయ పోటీ ల్లోనూ ప్రతిభ కనబరచాలని శుభాకాంక్షలు తెలిపారు.

## ఆలయాల్లో దొంగతనాలు - అప్రమత్తంగా ఉండండి: ఎస్సై జయన్న



**ఆత్మకూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ఆత్మకూర్ మండలంలో గత వారం రోజులుగా ఆలయాల్లో వరుస దొంగ తనాలు జరుగుతున్న నేపథ్యంలో పూజా రులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ ఎస్సై వి.జయన్న సూచించారు. గుడుల్లో విగ్రహాలకు అలంకరించే బంగారు, వెండి ఆభరణాలను పూజ అనంతరం గుడిలో ఉంచకుండా తీసుకెళ్లి భద్రపరచాలని, హుండీలోని నగదును కూడా జాగ్రత్తగా ఉంచాలని పూజారులకు సూచించారు. అదేవిధంగా ప్రజలు తమ ఇళ్లలో విలువైన వస్తువులు, డబ్బులు ఉంచి తాళాలు వేసి వెళ్లవద్దని, విలువైన వస్తువులు ఇంట్లో ఉంటే తప్పకుండా మనుషులు ఉండాలని, వీలైతే లాకర్లలో భద్రపరచుకోవాలని కోరారు. దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## చంద్రగట్టు కోట అభివృద్ధికి రూ.25 లక్షలతో శ్రీకారం

**అమరచింత, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండలంలోని చంద్రగట్టు కోట అభివృద్ధి పనులకు రూ.25 లక్షల నిధులతో తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ వైస్‌చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ శివాలయంలో భూమిపూజ చేశారు. శివాలయ కోనేరుకు ఫినిషింగ్, అన్నదాన కార్యక్రమాల కోసం షెడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్ట నున్నట్లు తెలిపారు. మంత్రులు వాకిటి శ్రీహరి, టూరిజం శాఖ మంత్రి ద్వారా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. భక్తుల కోరిక మేరకు ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శశికళ కురుమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామ అధ్యక్షులు, సర్పం చులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** తెలంగాణ వీరవనిత, రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం, ప్రదర్శించిన ధైర్య సాహసాలు తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం

- **ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక శ్రేయస్సుకు కృషి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** భూమి, భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి అధికారులు, రజక సంఘం నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1940వ దశకంలో తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె అలుపెరుగని పోరాటం చేశారని కొనియా డారు. ఆమె జీవిత చరిత్ర భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచేం దుకు ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఆమె సేవలకు గుర్తుగా కోఠి ఉమెన్స్ కాలేజీకి ఐలమ్మ పేరు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, అదనపు కలెక్టర్ మధుమోహన్, అధికారులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

# మరసం 40 ఏళ్ల సాహిత్య మహాసభలు

- **అక్టోబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహణ.. హాజరుకానున్న హరీశ్‌రావు**



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మంజీరా రచయితల సంఘం (మరసం) 40 ఏళ్ల సాహిత్య మహాసభలను అక్టోబర్ 2న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య రంగంలో వచ్చిన మార్పులు, వివిధ సాహిత్య వాదాలు, సామాజిక ఉద్యమాలపై మరసం తనదైన రీతిలో రచనలు, కార్యక్రమాలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మహాసభల ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, కవి నందిని సిధారెడ్డి, ప్రముఖ గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు 'సాహిత్యం-వివిధ దృక్పథాలు' అంశంపై రెండో సభ నిర్వహించనున్నారు. మహిళా దృక్పథంపై నెల్లుట్ల రమాదేవి, దళిత దృక్పథంపై కవి, రచయిత కోయి కోటేశ్వర్‌రావు, ద్రావిడ దృక్పథంపై కవి జిలుకర శ్రీనివాస్ ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం మరసం కవులతో కవి సమ్మేళనం జరుగుతుంది. ఆహ్వానపత్రం ఆవిష్కరణలో మరసం అధ్యక్షుడు కె. రంగాచార్య, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, ఉపాధ్యక్షుడు నందిని భగవాన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు తోట అశోక్, అలాజ్‌పూర్ శ్రీనివాస్, కవి పొన్నాల బాలయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ, ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

# నంబర్ ప్లేట్ లేకుండానే ఇసుక రవాణా!

• అనుమతులు ఉన్నా.. క్షేత్రస్థాయిలో నిబంధనలకు తూట్లు

మహమ్మదాబాద్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): మహమ్మదాబాద్ మండలంలో అనుమతుల పేరుతో ఇసుక రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధర్మపూర్ వాగు నుంచి చిన్నాయపల్లికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కొందరు సర్పంచులు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ రవాణాకు ఉపయోగిస్తున్న కొన్ని ట్రాక్టర్ ట్రాలీలకు నంబర్ ప్లేట్లు లేకపోవడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతి పత్రాల్లో వాహన వివరాలు...**

ఇసుక రవాణాకు అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాల్లో ట్రాక్టర్, ట్రాలీ నంబర్లతో పాటు డ్రైవర్ పేరు తదితర వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు తిరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతి పత్రంలోని వివరాలకు, వాస్తవంగా ఇసుక తరలిస్తున్న వాహనాలకు పొంతన ఉందా అనే అంశంపై అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.

**వాహనాల గుర్తింపుపై ప్రశ్నలు...**

అనుమతి ఉన్నప్పటికీ వాహనాల గుర్తింపు, నంబర్ ప్లేట్ల నిబంధనలు పాటించాల్సిందేనని స్థానికులు పేర్కొంటున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా ఇసుక తరలిస్తే వాహనం ఎవరిది, ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడికి వెళ్తుందనే వివరాలను గుర్తించడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.






**చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్**

ఈ వ్యవహారంపై తహసీల్దార్ విద్యాశాఖరెడ్డిని 'జనంసాక్షి' ప్రతినిధి వివరణ కోరగా, అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకుండా ఇసుక తరలించే వాహనాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ రవాణా ఘటనలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## నకిలీ ఎస్సీ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలి: డీహెచ్‌పీఎస్

ఆత్మకూర్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి): నకిలీ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీహెచ్‌పీఎస్ వనపర్తి జిల్లా కార్యదర్శి ఏ.రవీందర్ డిమాండ్ చేశారు. ఆత్మకూర్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూర్, ఖానాపురం, మూలమల్ల గ్రామాలకు చెందిన కొందరు బీసీ-బీ గొల్లకురు వలు తప్పుడు సమాచారంతో ఎస్సీ (మాదాసి కురువ) సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆరోపించారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు, వైద్య విద్య సీట్లు పొందిన వారిపై విచారణ జరిపి, సర్టిఫికెట్లు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాతే సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన సురేందర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):



అత్యవసరంగా ఏ-నెగటివ్ రక్తం అవసరమున్న యూత్ రెడ్‌క్రాస్ పిలుపుకు స్పందించి దేశిటిక్యాలకు చెందిన ఏ. సురేందర్‌రెడ్డి ఒక యూనిట్ రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేశారు. రక్తం అందుబాటులో లేక శస్త్రచికిత్స వాయిదా పడే పరిస్థితిలో ఆయన స్పందించడంతో బాధిత కుటుంబానికి సకాలంలో రక్తం అందింది. ఈ సందర్భంగా యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ దామగట్ల కుమార్ సురేందర్‌రెడ్డిని అభినందించారు. ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, అత్యవసర సమయాల్లో రక్తదాతలు సకాలంలో స్పందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరారు.

## మక్తల్ అడ్వకేట్స్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడిగా తిమ్మన్న



మక్తల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): మక్తల్ కోర్ట్ అడ్వకేట్ అడ్ హక్ కమిటి అధ్యక్షుడుగా తిమ్మన అడ్వకేట్ ఎంపిక అయ్యారు. శనివారం మక్తల్ పట్టణం కోర్టు భవనంలో బార్ అసోసియేషన్ హాడ్ హక్ కమిటి అధ్యక్షుడు ఎంపిక నిర్వహించారు. ఎలక్షన్లో 36 మంది అడ్వకేట్లు పాల్గొనగా తిమ్మన్న అడ్వకేట్ అధ్యక్షునిగా ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా తిమ్మన్నను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో అడ్వకేట్ లు రాజేశ్వర్ గౌడ్, కాశీశ్వర్, నర్సింలు సురేందర్, సూర్య ప్రకాశ్, దత్తాత్రేయ, ఆనంద్, రవి కుమార్ గౌడ్, భరత్, ఆనంద్ సునీత, రాజశేఖర్, వెంకటేష్ గౌడ్, రఘు నందన్ గౌడ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



బాలానగర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): కేతిరెడ్డిపల్లిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల్లో మామిడి తోటల సంరక్షణ, అధిక దిగుబడికి అవసరమైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. జిల్లా ఉద్యానవన అధికారి కె. వేణుగోపాల్ నీటి సంరక్షణ, మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకం సబ్సిడీలు, మార్కెటింగ్, కోల్డ్‌స్టోరేజ్ సౌకర్యాలను వివరించారు. ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త నాగహర్షిత డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, కత్తిరింపులు, పోషక యాజమాన్యంపై సూచనలు చేశారు. శాస్త్రవేత్త మౌనిక పురుగులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



మల్దకల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): మోదీజీ 25 సంవత్సరాల సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పెద్దొడ్డి గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో టీచర్‌ను బీజేపీ నాయకులు సన్మానించి, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుప్రీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా మహిళలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, వివిధ సేవలు అందుతున్నాయని తెలిపారు. కేంద్రాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తూ స్మార్ట్ లెర్నింగ్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పోషణ్ ట్రాకర్‌తో సేవలను డిజిటల్‌గా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏ.వి.రెడ్డప్ప, వాసురెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు అందించాలి

• అత్యవసర వేళ బాధితులకు అండగా నిలవాలి: ఎమ్మెల్యే యెన్నం



మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ నూతన చైర్మన్‌గా కేవస్ రవికుమార్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణయ్య, కోశాధికారిగా జి.రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నూతన పాలకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...** రెడ్‌క్రాస్ ద్వారా జిల్లా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సాయం అందించాలని, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ లలితమ్మకు మంత్రి జూపల్లి పరామర్శ

చిన్నంబావి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):



గడ్డ బస్వాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మందడి చిదంబర్ రెడ్డి మాతృమూర్తి, మాజీ సర్పంచ్ మందడి లలితమ్మ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. లలితమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కష్టసమయంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్, బీచుపల్లి యాదవ్, తూర్పుంటి కురుమూర్తి, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ జనసేన కో-ఆర్డినేటర్‌గా మణికంఠ గౌడ్



మక్తల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ కీలక నియామకం చేపట్టింది. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా మక్తల్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ డా. మణికంఠ గౌడ్‌ను నియమించింది. పార్టీ అధిష్ఠానం నిర్ణయంతో జనసైనికులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు మణికంఠ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రతిఘటన పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తి

• బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరనారి: నీలం మధు





పటాన్‌చెరు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): పెత్తందారుల అణచివేతకు వ్యతిరేకంగా తిరుగుబాటు, ప్రతిఘటన పోరాటానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్‌లో ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం పాలనలో వెట్టి చాకిరీ, దొరలు, జమీందారుల దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాడారని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో మహనీయుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి కీలకమన్నారు. భవిష్యత్ తరాలకు ఐలమ్మ స్ఫూర్తిని అందించేందుకు చిట్కుల్‌లో ఆమె కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని నీలం మధు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోతె సుమలత, కౌన్సిలర్లు, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు



**నవాబుపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డిపై సోషల్ మీడియా, బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన రామన్ గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నవాబుపేట మండల నాయకులు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకికి ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యేను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని నాయకులు పేర్కొన్నారు.

ఇలాంటి వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత వ్యక్తిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్పీ, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రతిభ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

- **విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు, నగదు బహుమతుల అందజేత**




**ఉప్పునుంతల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** పాలమూరు ఎన్నారై ఫోరం సహకారంతో నిర్వహించిన పాలమూరు ప్రతిభ పరీక్ష ఉప్పునుంతల మండల స్థాయిలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారి జే. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, నగదు బహుమతులు అందజేశారు. ఇలాంటి ప్రతిభా పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో పోటీ తత్వం పెరగడంతోపాటు విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోకల సతీష్, ఎస్. చంద్రశేఖర్, ఏ.శ్యాంసుందర్, అజ్మతుల్లా, వి. రాజు, బిల్కిష్, కవిత, బాలకృష్ణ, సరస్వతి, శ్రీనివాస్, అంజన్‌కుమార్, జ్యోతి, ఎన్నారై ఫోరం సభ్యులు చల్లా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు



**రేవల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో ఘనంగా జరిగాయి.

గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద జై నినాదాలు చేస్తూ ఐలమ్మ ఆశయాలను కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో భూస్వాముల వెట్టిచాకిరికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వీరవనిత ఐలమ్మ అని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ప్రతి మహిళలో ఐలమ్మ ధైర్యం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆమె విగ్రహానికి టీఎన్జీఎస్ జిల్లా నాయకులు ఘన నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ జావీద్ అలీ, కార్యదర్శి వి. రవి పూలమాల వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఎస్ నాయకులు, జావిద్ అలీ, రవి, యువజన సంఘాశీ నాయకుడు కూన గోపాలకృష్ణ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## పద్మశాలి సంఘం అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం



**సదాశివపేట, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పద్మశాలి సంఘం నంబర్-1 అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం పిలుపునిచ్చారు. బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తొలి మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బస్టాండ్ వద్ద ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ముడుమాల్ నీలురాళ్ల పరిరక్షణకు సమష్టి కృషి

- **ప్రపంచ వారసత్వ సంపదలను కాపాడుకోవాలి: కలెక్టర్ ప్రియాంక**




**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలోని వేల సంవత్సరాల నాటి నీలురాళ్లు (మెగాలిథిక్ సమాధులు) చారిత్రక, పురావస్తు, ఖగోళ శాస్త్రపరంగా ఎంతో ప్రాధాన్యత కలిగినవని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ముడుమాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అరుదైన చారిత్రక ఆనవాళ్లను భవిష్యత్ తరాలకు అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ముడుమాల్ నీలురాళ్ల ప్రాంతం యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రాంత అభివృద్ధికి పర్యాటక శాఖకు కార్యాచరణ ప్రణాళిక సమర్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం నీలురాళ్ల చుట్టూ సరిహద్దు ఏర్పాటు చేసి పరిరక్షణ చర్యలు చేపడుతున్నామని, ప్రధాన రహదారి నుంచి ప్రాంతానికి రహదారి అనుసంధానం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కలెక్టర్ నిధులతో రెండు, మూడు వారాల్లో రహదారి పనులకు మంజూరు కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

నీలురాళ్ల పరిసర భూములకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే భూసేకరణ లేదా ఇతర మార్గాలను పరిశీలిస్తామని చెప్పారు. ప్రభుత్వ నిధులతో పాటు ఇతర వనరులను వినియోగించి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నీలురాళ్లలోని ప్రతి రాయి వేల ఏళ్ల చరిత్రకు ప్రతీక అని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతీయకూడదని గ్రామస్తులకు సూచించారు.

విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పాఠశాలల నుంచి ముడుమాల్‌కు విద్యార్థులను తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక యువతలో నలుగురు, ఐదుగురిని ఎంపిక చేసి హైదరాబాద్‌లో పర్యాటక గైడ్‌లుగా శిక్షణ ఇప్పించాలని సర్పంచులకు సూచించారు. అనంతరం డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో హెరిటేజ్ అకాడమీ ప్రతినిధి డాక్టర్ ప్రవీణ్, పర్యాటక అధికారి రషీద్, డీఈఓ గోవిందరాజు, ఎంఈఓ నిజాముద్దీన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థిని అభినందించిన జిల్లా కలెక్టర్



**మల్దకల్, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** వీరనారిచాకలి ఐలమ్మ 131 వ జయంతిని పురస్కరించుకుని ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలలో అమరవాయిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, జిల్లా రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులచే ఈ బహుమతి మెమెంటో, జ్ఞాపిక, శాలువాతో పాటు 20000వేలునగదు బహుమతిని అందజేశారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గెలుపొందిన విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థినిలు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థి ఇందు, గైడ్ టీచర్ అనిత, ధనుంజయలను ప్రధానోపాధ్యాయులు నరేష్, సర్పంచ్ తూము కృష్ణారెడ్డి, చైర్మన్ మరియమ్మ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

# కలెక్టర్‌కు ఆహ్వానం పలికిన చైర్పర్సన్



**వడ్డేపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ఈనెల 29న ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషను వడ్డేపల్లి మున్సిపల్ చైర్పర్సన్ మంజుల ఆహ్వానించారు. శనివారం జిల్లా కలెక్టర్‌లో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసిన అనంతరం వడ్డేపల్లి మున్సిపాలిటీలోని ఏడవ వార్డులో ఏఐ స్టెతస్కోప్ ఆదారిత హార్ట్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమానికి హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఏఐ స్టెతస్కోప్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజనీర్ కూడా లేక అభివృద్ధి పనులు మందగిస్తున్నాయని వీలైనంత త్వరగా అధికారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వడ్డేపల్లి శ్రీనివాసులు కౌన్సిలర్లు విజయభాస్కర్, తిమ్మప్ప, ధర్మతేరు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ నేతలకు ఆత్మవిమర్శ లేదా?

- **రైతులకు సాగునీరు అందితే ఎందుకంత వ్యతిరేకత: కాంగ్రెస్ నేతలు**




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** రాజకీయ అవసరాల కోసం గతంలో చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మరిచిపోతున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, కౌన్సిలర్ ధనలక్ష్మి తదితరులు మాట్లాడారు.

గతంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని విమర్శించిన నాయకులే ఇప్పుడు ఆయనతో కలిసి మాట్లాడుతున్నారని, దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. నిరంజన్‌రెడ్డిపై భూకబ్జాలు, దందాలు, అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఉన్నాయని, వాటిపై ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులను బెదిరించినా వెనక్కి తగ్గబోమని మధుసూదన్ గౌడ్ అన్నారు. గౌడ సామాజిక వర్గంపై గతంలో చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలపై సంబంధిత నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధి వాల్యానాయక్ మాట్లాడుతూ కేఎల్ఐ ద్వారా రైతులకు సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాలువల మరమ్మతుల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంట్రాక్టర్‌గా రైతులకు సహకరించారని తెలిపారు.

వర్షాభావ పరిస్థితుల్లో రైతులను ఆరుతడి పంటల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సాగునీటి కోసం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో చర్చించడం అభినందనీయమన్నారు. రైతులకు నీరు అందించే ప్రయత్నాలను స్వాగతించాల్సింది పోయి బీఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. భూ వ్యవహారాలు, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై నిరంజన్‌రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళి

అన్యాయాన్ని ఎదిరిస్తూ ధైర్యంగా నిలబడిన ఐలమ్మ జీవితం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.తెలంగాణ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్రను స్మరించుకుంటూ ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎస్పీ సూచించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం ఆమె చేసిన కృషి భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీస్ కార్యాలయ ఏఓ కృష్ణయ్య, ఆర్ఐ జగన్, ఎస్ఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తొలి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ

- **సామాజిక వివక్షపై తిరుగుబాటు చేసిన ధైర్యశాలి: మున్నూరు రవీందర్**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ తొలి భూ పోరాటానికి నాంది పలికారని బీజేపీ రాష్ట్ర నాయకులు మున్నూరు రవీందర్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా వనపర్తి బస్టాండ్ సమీపంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక వివక్ష, అన్యాయానికి వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని, భూమి, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.శ్రీశైలం, అనూజ్ఞా రెడ్డి, పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



**రాజోళి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతిని కేవీపీఎస్ ఆధ్వర్యం లో శనివారం రాజోళి మండల కేంద్రంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆమె సాహసం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, పేదలు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సామాజిక కార్యకర్త మద్దూర్ గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీ కో అప్షన్ సభ్యులు నిషాక్, గౌండరాజు, సౌలు, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

- **ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**
- **పద్మావతి కాలనీలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు**
- **బడుగు వర్గాల హక్కుల కోసం ఐలమ్మ పోరాటం ఆదర్శప్రాయం**






**మహబూబ్‌నగర్, బ్యూరో సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పద్మావతి కాలనీలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మున్సిపల్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బేక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు పోలీస్ సిబ్బందికి క్రీడా సామాగ్రి

- **క్రీడల్లో ప్రతిభతో జిల్లా పోలీస్ శాఖకు పేరు తేవాలి: ఎస్పీ సంగ్రామ్ సింగ్**




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న క్లస్టర్--సి విభాగం రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్ పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ నుంచి ఎంపికైన అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ శనివారం క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో వివిధ రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటారని తెలిపారు. శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విధులతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఎస్పీ ఆకాంక్షించారు. విజయాలు సాధించి నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

క్రీడా సామాగ్రి అందజేయడం ద్వారా క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం పెంపొందుతుందని అన్నారు. జిల్లా స్థాయితో పాటు రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటుతూ పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**మల్దకల్,సెప్టెంబర్ 26 జనం (జనంసాక్షి):** మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో శనివారంఐలమ్మ 131 జయంతి వేడుకలకు మాజీ ఎంపీపీలు వై.సత్యారెడ్డి,వై.రాజారెడ్డి హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చాపకండ్ల కర్రెన్న,వార్డ్ మెంబర్ బి. హరిన్ కుమార్,గ్రామ ఐలమ్మ రజక కమిటీ సంఘం అధ్యక్షుడు సి. నర్సింహులు,ఉపాధ్యక్షుడు అమరేష్,సలహాదారుడు సిద్ధు,గ్రామ భీమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గోపాల కృష్ణ,సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



**జడ్చర్ల, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మహిళల్లో చైతన్యాన్ని రగిలించిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మన్న, ఆర్వో సలాం, ఆర్ఐ నాగేష్, ఏఈ గాయత్రి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 26, (జనంసాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. శనివారం రజక సంఘం, అధికార, విపక్ష పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని హద్మూర్ గ్రామంలో వీరనారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, మండల భాజపా పార్టీ అధ్యక్షుడు గంగువార్ మల్లేష్, రజక సంఘం మండల అధ్యక్షుడు మల్లికార్జున్, మాజీ అధ్యక్షుడు ఆడివన్న, అధికార, విపక్ష, రజక సంఘం శ్రేణులు ఆశప్ప, రాజ్ కుమార్, మహేష్, సంగారెడ్డి, శ్రీశైలం, షబ్బీర్ ఖాన్, దుర్గాదాస్ గౌడ్, సుభాష్, శివానంద్, సంఘన్న, రవి, పాండు, నరేష్, నరసింహులు, సంగారెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**కల్హేర్, సెప్టెంబర్ 26(జనంసాక్షి):** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో ఆమెకు ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ డైరెక్టర్ చంద్రప్ప స్వామి, మల్డొడ్డి పండరి, చాకలి భూపతి, చాకలి సాయిలు, సాలె కిష్టయ్య, జన్మ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాభవాని, ఎస్ఐ దుర్గారెడ్డి, రజక సంఘం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సావిత్రి, సిద్దిరాములు, వెంకట్రెడ్డి, మనోజ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.కంగ్టి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి )మండల కేంద్రమైన కంగ్టిలో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



**కంగ్టి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండల కేంద్రమైన కంగ్టిలో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాభవాని, ఎస్ఐ దుర్గారెడ్డి, రజక సంఘం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సావిత్రి, సిద్ది రాములు, వెంకట్రెడ్డి, మనోజ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



**సంగారెడ్డి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** సంగారెడ్డిలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు జి.అంజయ్య, కార్యదర్శి యం.మనోజ్ కుమార్ అధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బి.సి.సంక్షేమ శాఖ అధికారి జగదీష్ హాజరై వీరనారి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు.



**ధరూర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని BRS సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ధరూర్ మండల కేంద్రంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఆమె విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు.